

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## నామమాత్రంగా జరిగిన సమీక్ష సమావేశం




**నెల్లూరు అర్బన్, నవంబర్ 15, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ, ఉపాధి హామీ పథకం ద్వారా పనులు, జరుగుతున్నాయని పంచాయితీ రాజ్ కమిషన్ నుండి వచ్చిన మేనేజర్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ తెలిపారు. శుక్రవారం నూతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో, జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ ఈ అశోక్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా గంగా భవానితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో మేనేజర్, నిధులతో పనులు సాగుతున్నాయని అన్నారు. 67 .29 కోట్ల రూపాయలు, 1146 అంతర్గత సిసి రోడ్లు పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పన్నులు అన్ని నవంబర్ 30న ప్రారంభించి డిసెంబర్ 31 లోగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. వచ్చే సంక్రాంతి కల్లా సీసీ రోడ్లు ప్రారంభించాలని చెప్పి ఈ పనులు జరిగే విషయంలో నాణ్యతతో రాజీవద్దని ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామ ఏపిడి, ఏపీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రదాత కావలి ఎమ్మెల్యే దగుమాటి



**బోగోలు, నవంబర్ 15 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించగలిగే ఏకైక నాయకులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అని మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. బోగోలు మేజర్ పంచాయితీలోని గిరిజన కాలనీలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్‌చేసి నిరుపేదలకు దుప్పట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిలకపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కావలిని కనకపట్నంగా తీర్చిదిద్దగలిగేనేత ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిఅని ఆయన మరెన్నో జన్మదినోత్సవాలు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. బోగోలుమండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే దగుమాటి సహకారంతో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గనిపినేని నాగరాజు, గోచిపాతల సంజయ్, సుభాని, పోతల శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బిర్సా ముండా జీవితం గిరిజనుల పోరాట పటిమకు నిదర్శనం




**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 15,ప్రభాతవార్త:** బిర్సా ముండా జయంతి సందర్భంగా ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ లో ముఖ్య అతిధిగా మేయర్ స్రవంతి జయవర్ధన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ స్రవంతిజ యవర్ధన్ మాట్లాడుతూ బిర్సా ముండా అనేది కేవలం ఒక పేరు కాదు ఒక ఉద్యమ స్ఫూర్తి,23 ఏళ్ళ వయస్సు లోనే బ్రిటిషర్ల పై యుద్ధం ప్రకటించి మిలినేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించిన గొప్ప వీరుడు బిర్సా ముండా,ఆ రోజుల్లో చాల మంది గిరిజనుల్ని స్వాతంత్ర్యోద్యమం వైపు ఆకర్షితులైయే విధంగా ప్రోత్సహించి వారిని ఉద్యమ బాట పట్టించిన మహా నాయకుడు,దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బ్రిటిష్ వారి పై పోరాటం చేయడమే కాక,చివరికి విష ప్రయోగానికి గురై తన ప్రాణాలను సైతం దేశం కోసం అర్పించిన పోరాట యోధులు బీర్సా ముండా,వారి గౌరవార్థం పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో బీర్సా ముండా గారి చిత్రపటం ఉంది అంటే అది వారి పోరాట పటిమకు నిదర్శం అని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ పరిమళ,ఏపిఓ జోష్నా,శారదా,శాంతి గిరిజన నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర ,ఎస్టి కమిషన్ శంకర్ నాయక్ జిల్లా పర్యటన

**నెల్లూరు అర్బన్, నవంబర్ 15, ప్రభాతవార్త** రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 16వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో గిరిజనులు, గిరిజన సంఘాల నుంచి అర్జీలు స్వీకరించి, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. ఉదయం 10.45 గంటలకు కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహం చేరుకుని జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటలకు పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడతారు.

## నందవరం కూడలి వద్ద 8మద్యం బాటిల్స్ స్వాధీనం

**మర్రిపాడు,నవంబర్15ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నందవరం కూడలి వద్ద శుక్రవారం 8మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తి కర్నూల్ తెలిపారు. నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై నందవరం చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రామానాయుడుపల్లికి చెందిన దాసరి నర్శింహులు 8మద్యం బాటిల్స్‌ను మోటర్‌బైక్‌పై అక్రమంగా తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకున్నా మన్నారు. బాటిల్‌పై బ్యాచిలర్ నెంబర్ లేకపోవడం వలన ఈమద్యం ఏ షాపుకు చెందినదో నిర్ధారించలేకపోయామన్నారు. ఈమేరకు దాసరి నర్శింహులుపై కేసు నమోదు చేశామన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు



**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త** కందుకూరుటౌన్ పరిధిలోని అన్ని ప్రైవేటు విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపులను మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ నాగరాజు శుక్రవారం తనిఖీ చేశారు. పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లు అందరూ షాపుల ముందు డీలర్ షాపు పేరు, లైసెన్సు నెంబర్, అడ్రస్ బోర్డు చూపించాలని, తప్పనిసరిగా మీ యొక్క లైసెన్సులో ఎరువులను సరఫరా చేసే కంపెనీల ఉత్పత్తులను ఫారం ఓ ద్వారా పొందుపరుచుకోవాలని, ఎరువులు, ఎంఆర్పీ రేట్లకు మాత్రమే విక్రయించాలని, రైతుకు రసీదు ఇవ్వాలని, నోటీసు బోర్డులో అమ్మకపు రేట్లు, నిల్వ చూపించాలని, బిల్ బుక్‌లో రైతు సంతకం, డీలర్లు సంతకం ఉండాలని, పాస్ పుస్తకంలో రైతు విస్తీర్ణం బట్టి బయోమెట్రిక్ ఆధారంగా వేలిముద్ర వేసుకుని ఎరువులను పంపిణీ చేయాలని తెలియజేశారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సంగంమేశ్వరుని సన్నిధిలో పుష్పాలతో శివలింగాకారం



**సంగం నవంబర్ 15 ప్రభాతవార్త** కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని మండల కేంద్రమైన సంగంలోని శ్రీకామాక్షి సమేత సంగమేశ్వరుని సన్నిధిలో రకరకాల పుష్పాలతో శివలింగాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు పెద్దఎత్తున ఆలయంలో కార్తిక దీపాలు పెట్టారు. సంగమేశ్వరుని సన్నిధి భక్తులతో కిటకిటలాడింది.అలాగే చెర్లో వంగల్లు గ్రామంలో భీమేశ్వరాలయం,దువ్వూరులోనికోటేశ్వరస్వామి వారి సన్నిధి, అన్నారెడ్డిపాళెంలోని జ్ఞానప్రసూనాంబా తారకేశ్వరస్వామి సన్నిధిలో మహిళలు కార్తికదీపాలు పెట్టిపరమేశ్వరుడ్ని దర్శించుకున్నారు. కార్తీకదీప కాంతులతో శివాలయాలలు కిటకిటలాడాయి.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబర్15, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం5,365క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో69.346టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 400, ఎన్ఎఫ్‌సికి 550, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు3000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.396 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# స్కూల్ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలి



**ఆత్మకూరు,నవంబర్15ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం మహిమలూరు ఉన్నతపాఠశాల అదనపు భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ , రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి కోరారు. తమ స్వగ్రామమైన మహిమలూరులో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలసి పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. మొదట వరసిద్ధి వినాయకస్వామి, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లాపరిషత్ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అదనపు భవనాల నిర్మాణం బేస్‌మట్టం స్థాయిలో ఆగిపోవడం వలన హైస్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని జిల్లాకలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులను రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ , రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి, ఆత్మకూరు శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో నిధులు తీసుకురావాల్సి ఉంటుందని ఈసమస్యను వారి దృష్టికి తీసుకెళ్ళాలని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని, సిఐ గంగాధర్‌రావ్, ఎస్ఐ జిలానీ, శ్రీసాంబశివా చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మెన్ కంచివరమేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు వల్లూరు వెంకటరమణారెడ్డి, మహిమలూరు గ్రామపెద్దలు , నాయకులు పాల్గొన్నారు.



# హత్యకేసులో ముద్దాయి అరెస్టు... కత్తి స్వాధీనం



### కావలి డిఎస్పి పి.శ్రీధర్

**కావలి, నవంబర్ 15 ప్రభాతవార్త** అక్రమ సంబంధం మహిళ హత్యకు దారితీసిందని కావలి డిఎస్పి పి.శ్రీధర్ తెలిపారు. ఈ హత్యకేసులోని ముద్దాయిని అరెస్టుచేసి అతనివద్ద ఉన్న కత్తిని స్వాధీనపరచుకున్నట్లు ఆయన తెలిపారు. కావలి డిఎస్పి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హత్యకు గల కారణాలు వివరించారు. ఈ నెల 12వ తేది జరిగిన హత్యకేసులో ముద్దాయిని అరెస్టు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మృతురాలు జలచిత్రపండు అలియాస్ తస్లీమ్‌కు పెళ్లయి భర్త చనిపోయాడన్నారు. ముద్దాయి జలచిత్ర దత్తాత్రి అలియాస్ దత్తు అనే అతన్ని మృతురాలు 2006వ సంవత్సరంలో రెండవ వివాహం చేసుకుందన్నారు. అప్పటికే దత్తుకు అల్లిమడుగు సంగంకు చెందిన కరుణ అనే ఆమెతో వివాహమైందన్నారు. ఆమె 2017వ సంవత్సరంలో చనిపోగా ఆమె చెల్లెలు శ్రావణిని మూడవ వివాహం చేసుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలో మృతురాలు జలచిత్రపండు చంటి అనే అబ్బాయితో అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో భార్యభర్తలైన తస్లీమ్, దత్తులు తరచుగా గొడవపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 12వతేది సాయంత్రం దత్తు తన భార్య తస్లీమ్‌తో గొడవపడి ఆమెను కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపేసి పారిపోయినట్లు కావలి డిఎస్పి శ్రీధర్ తెలిపారు. కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పాపారావు, బిట్రగుంట ఎస్ఐ బోజ్య, పోలీసు సిబ్బంది హత్యచేసిన వ్యక్తికోసం గాలింపుచర్యలు చేపట్టారన్నారు. జిల్లా ఎస్పి ఆదేశాలమేరకు తన ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది వుడ్‌హౌస్‌పేట క్రాస్‌రోడ్డు జంక్షన్‌వద్ద ముద్దాయి దత్తును అరెస్టుచేశారని తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పాపారావు పాల్గొన్నారు.

# శ్రీరాజరాజేశ్వరీ,కాశీవిశ్వేశ్వరస్వామి సన్నిధిలో వైభవంగా యజ్ఞ పూర్ణాహుతి



**సంగం నవంబర్ 15 ప్రభాతవార్త** సంగం తిరమనకొండపైన కొలువైవున శ్రీరాజరాజేశ్వరీదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి జ్ఞాన పీఠంలో లోక కళ్యాణార్థం విశ్వశాంతి ధర్మసంస్థాపనార్ధ సంవృద్ధి పాడి పంటలకొరకు ఆశ్వీయుజ పాడ్యమి నుండి కార్తీక పౌర్ణమి వరకు 44 రోజులు అత్యంత భక్తి శ్రద్దలతో శ్రీలలితా రుద్రమహాయజ్ఞాన్ని పీఠాది పతులు రాజరాజేశ్వరనాందస్వామి నేతృత్వంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి భజన బృందాలు వచ్చి భజన కీర్తనలు, స్తోత్ర పారాయణలు నిర్వహించారు. దశమహా విద్యాదేవతలు శ్రీలలితా సహస్రనామ,శ్రీషోడశ లక్ష్మీ దేవతా మంత్రాలతో యజ్ఞం చేశారు. రాష్ట్ర నలుమూలల నుండి ధ్యాన జ్ఞాన ప్రాణాయామం కొరకు సాధకులు రావడం జరిగింది.కార్తీక పౌర్ణమి యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అదికార ప్రతినిధి కర్నాటిఆంజనేయరెడ్డి, తహసిల్దారు సోమ్లానాయక్,ఆర్ఐరాజు,చెర్లోవంగల్లు భీమేశ్వర దేవస్థానం ఛైర్మెన్ పగడాల రఘురామయ్య, నెల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ రఘురామయ్య దేవసేనమ్మ, కోలగట్ల నుండి అల్లూరు బాస్క ర్‌రెడ్డి అల్లూరు ఆదిశేషారెడ్డి, భజన గురువులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్తిదీపోత్సవం,కోటి దీపోత్సవం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



# ఆధునిక సాంకేతికపరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి : ఏడీ అనసూయ

**వలేటివారిపాలెం నవంబరు 15, ప్రభాతవార్త** వ్యవసాయసాగులో ఆధునిక సాంకేతికి పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ సహాయసంచాలకులు అనురాద రైతులకు సూచించారుప.మండలంలోని శాఖవరం గ్రామంలో శుకృవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల వ్యవసాయాధికారి హేమంత్‌భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలువురు రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. శనగపంట సాగుపద్ధతులపై రైతులకుఅవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ మరియు ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీవారు నిర్దేశించిన సాంకేతిక సలహాలు పాటించాలన్నారు.అలాగే సాగుచేసి పండించిన ఉత్పత్తులకు స్కోప్ సర్టిఫికెట్ ఇప్పించి ఫార్మర్ ప్రోడ్యూసింగు ఆర్గనేజేషన్ ద్వారా మద్దతు దర కన్నా 20శాతం అదిక మార్కెట్ ధర కల్పించి ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం కల్పిస్తామని ఆమె తెలియచేశారు.శనగ మరియు మినుము పంటలలోఉత్తమ యాజమాన్యపద్ధతులను వివరించారు. శనగ పంటలో నేలద్వారా సంక్రమించే ఎండు తెగలు,మొదులకుళ్ల తెగులు వేరుకుళ్ల తెగులును నివారించడానికి చేపట్టాల్సిన చర్యలు వివరించారు.అనంతరం శనగలోవ్తిన శుద్ధి ప్రదర్శన చేశారు.కిలో శనగ విత్తనానికి 10గ్రాముల ట్రైకోర్మావిరిడిని బాగా పట్టించి ఆరిన తరువాత భూమిలో పిచికారీ చేయాలన్నారు. తద్వారా విత్తనం ద్వారా గానీ, భూమిద్వారా గానీ ఆశించే ఎండుతెగులు నివారించుకోవచ్చని అనసూయ తెలిపారు. పీ కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంటు గౌతమితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.




## జీవీరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ చైర్మన్‌గా జీవీరెడ్డి శుక్రవారం విజయవాడలో నివారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జీవీ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



## శాఖవరం హైస్కూలును ఆకస్మికతనిఖీ



**వలేటివారిపాలెం నవంబరు 15, ప్రభాతవార్త** మండలంలోని శాఖవరం ఉన్నతపాఠశాలను శుకృవారం కందుకూరు డిప్యూటీ డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది శాఖవరం పాఠశాల మంచి ఫలితాలు సాధించిందన్నారు. ఉపాధ్యాయుల పనితీరు ప్రశంసనీయము. నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్‌పరీక్షనందు ఈ పాఠశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.పదవ తరగతి విద్యార్థుల రానున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈవో మల్లికార్జునరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన న్నయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

## రాజవోలులో ఘనంగా నక్షత్ర దిపోత్సవం



**అనుమసముద్రంపేట, నవంబర్ 15ప్రభాతవార్త:** కార్తీకమాసంలో త్రయోదశి పర్వదినం సందర్భంగా ఏఎస్‌పేట మండలం రాజవోలులో ని శ్రీకాశీ అన్న పూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నక్షత్ర దిపోత్స వాన్ని నిర్వహించారు. ఈకా ర్యక్రమానికి భక్తులు భారీగా హాజరై దీపాలను వెలి గించి నక్షత్ర దిపోత్స వాన్ని ఎంతో భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చిట్టమూరు వెంకటరెడ్డి కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ త్రయోదశి సందర్భంగా నక్షత్ర దిపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించామని గ్రామంలో అందరూ సంతోషంగా , సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈకార్యక్రమానికి కొండా శ్రీనివాసులురెడ్డి దంపతులు, తిక్కవరపు శ్యాంప్రసాద్‌రెడ్డి దంపతులు ధూపదీప నైవేధ్యాలకు కావాల్సి న ఏర్పాట్లుకు సహకారం అందించారన్నారు. అందరి సహకారంతో ఎంతో వైభవంగా స్వామివారి , అమ్మవార్లకు పూజాకార్యక్రమం నిర్వహజంచామని కార్యక్రమానికి వచ్చిన భక్తులకు గ్రామ ప్రజలకు ఆమహాశివుని ఆశీస్సులు నిండుగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమాన్ని పండితులు సుబ్రహ్మణ్యం స్వామి నిర్వహించారు. ఈకార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనోజ్‌కుమార్, ముంగుమూరు వెంకటరెడ్డి , రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని పొందాలి



**కావలిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త :** పుస్తక పఠనం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని పెంపొంది ంచుకో వాలని కావలి న్యాయస్థానాల ఎపిపి యం. మృదుల తెలియచేశారు. కావలి పట్టణంలోని వెంగళరావునగర్ ప్రభుత్వశాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రం థాలయ వారోత్స వాల సంద ర్భంగా శుక్రవారం పుస్త కప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎపిపి మృదుల మాట్లాడారు. విద్యార్థులు, యువత తరచుగా గ్రంధా లయాలు సందర్శించి పోటీ పరీక్షలు మరియు విజ్ఞానాన్ని ఈ గ్రంధాలయం ద్వారా పొందాలని కోరారు. లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వ్యసనాలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. యువత దేశభక్తిని పెంచుకుని దేశప్రగతికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వశాఖ గ్రంథాలయ అధికారిణి యస్.సునీత మాట్లాడారు. గ్రంధాలయాలద్వారా ప్రవహించే జ్ఞానాన్ని పెంపొందించుకున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, డాక్టర్ కారల్‌మార్క్స్ సమాజానికి ఎనలేని సేవలందించిన మహనీయులుగా చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, లైబ్రరి ఉద్యోగులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేటలో గ్రంథాలయ వారోత్సవాలు

**అనుమసముద్రంపేట, నవంబర్15ప్రభాతవార్త:** ఏఎస్‌పేటలోని గ్రంథాలయంలో శుక్రవారం లైబ్రేరియన్ శ్రీనివాసరాజు 57వ గ్రంథాలయ వారోత్స వాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ షేక్ తాజున్నీసా భర్త, ముస్లింమైనార్టీ నాయకుడు షేక్ జిలాని బాషా పాల్గొని గ్రంథాలయ వారోత్స వాల పోస్టర్‌ను ఆవిష్కరిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులు, నిద్యోగులు ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పొందాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధరకాల పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఈనెల 20న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని శ్రీనివాసరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినాయత్, షేక్ షరీఫ్, నాణెముల సేకరణ కర్త ఎండి వాయిజ్, వెటర్నరీ సిబ్బంది సి.హెచ్.శేషారెడ్డి, ఎం.డి.అజ్గర్‌బాషా, షేక్ యస్దాని, కె.సుందరం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



**అనంతసాగరం, నవంబర్15ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల లోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పెన్నాన దిలో స్నానమాచరించి ఆలయంలో దీపాలు వెలి గించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయ కుండా భక్తులు అధికసంఖ్యలో హాజర య్యారు. వచ్చిన భక్తులకు ఆత్మకూరు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## గ్రామాలను అభివృద్ధి చేయాలి ఎంపీడీవో సుబ్బారావు



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 15, ప్రభా తవార్త :** స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పం చ్లు,ఎంపీటీసీ, పలు శాఖ అధికారులతో శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్య ంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా టా ్లడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ప్రణా ళికను గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారు లతో సమీక్షించి గ్రామ అభివృద్ధికి ఎలాంటి మౌలిక సదుపాయాలు అవసరము చర్చించుకోవాలన్నారు. అనం తరం విస్తరణ అధికారి సాయి ప్రసాద్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామాలు అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు అన్ని శాఖల సమన్వయంతో కలిసి పనిచేయాలని అవగాహన కల్పించారు. అంత కముందు రామన్నపాలెం, కమ్మ పాలెం, పంచాయతీ కార్యదర్శులు సురేష్, మనోహర్ శిక్షణ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యులు, డిజిటల్ అసిస్టెంట్లు,పొదుపు వివోఏలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మదకద్రవ్యాల పై అవగాహన



**విడవలూరు,నవంబర్15, ప్రభాతవార్త :** మండల కేంద్రం గ్రంథాల యంలో 57వ జాతీయ వారోత్స వాల లో భాగంగా విద్యార్థిని విద్యార్థు లకు మదకద్రవ్యాల పై గ్రంథాలయ లైబ్రేరియన్ స్వరూప ఆధ్వర్యంలో డాక్టర్ సురేంద్ర అవగాహన కల్పిం చారు. గ్రంథాల యంలో పూర్వకాలం పుస్తకాలు భద్రప రిచేవారు. పుస్తక ప్రాముఖ్యతను మదకద్రవ్యాల వల్ల విద్యార్థులకు పెద్దలకు జరిగేటువంటి నష్టాలను వాటి నుండి ఎలా బయటపడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమం



బుచ్చి నవంబర్ 15 ప్రభాతవార్త 2025,26 గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక మీద సర్పంచ్‌లకు,ఎంపిటిసిలకు,మండలస్థాయి అధికారులకు పంచాయితీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్లకు ఇఒఎలకు ఎంపిడిఒ కార్యలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీహరి, విఒపిఆర్‌డి నారాయణరెడ్డి, పంచాయితీలకు వచ్చే 15 వ ఆర్దిక సంఘం నిధులు,సాధారణ నిధులు ,జలజీవన్‌మిషన్ నిధులు, ఎన్‌ఆర్‌జిఎస్ నిదులు మరియు ఇతర ప్రభుత్వ విభాగాల ద్వారా వచ్చే నిధులను కలిపి ప్రణాళికను తయారు చేయాలని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలోని9 తీమ్‌లలో ఒక దానికి ప్రాధాన్యత ఇస్తు 10 శాతం 15 వ ఆర్దిక సంఘం నిధులు కేటాయించాలని,జనవరి 31 లోగా జిపిడిపి పూర్తి కావాలని లేని యెడల 1 వ ఆర్దిక సంఘం నిధులు విడుదల కావు అని తెలియజేశారు. బాలల గ్రామసభ, మహిళ గ్రామసభ, మరియు ప్రత్యేక గ్రామసభను నిర్వహించి ప్రజలందరి భాగస్వామ్యంతో పనులు గుర్తించాలని వాటికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి,ఆర్‌డబ్ల్యూస్ ఏఇ హరికృష్ణా, ఎఇఒ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికను పటిష్టంగా చేయాలి ఎంపీడీవో నగేష్‌కుమారి



**విడవలూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :** మండలంలో ఉన్న పంచాయతీల్లో ప్రజాప్రతి నిధులు, క్రింది స్థాయి అధికారులు గ్రామ పంచాయ తీలను అభివృద్ధి ప్రణాళికను పటిష్టంగా చేయాలని స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో అన్ని శాఖ అధికారులు గ్రామానికి ఏ లాంటి మౌలిక సదుపాయాలు కావాలో చర్చించుకుని సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు ఎంపీటీసీ, సర్పంచ్లుకు, క్రింద స్థాయి అధికారులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమణమ్మ, జడ్పిటిసి తుమ్మల లక్ష్మయ్య, ఉప ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాముడుపాలెంలో 500 మందికి అన్నదానం



**ఇందుకూరుపేట, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం రాము దుపాలెం గ్రామంలో శుక్రవారం అన్నపూర్ణ కాశి విశాలాక్షి దేవి సమేత కాశీ విశ్వేశ్వరుడు శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఇందుకూరుపేట మండల కన్వీనర్ జొన్న వాడ దేవస్థాన చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, మావులూరి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు 500 మందికి అన్నదానం చేయడం జరిగింది.

## ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిపై విచారణ



**ఉదయగిరి, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి సామాజి క ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్య ఆరోగ్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ అధికారి సిద్దా నాయక్ మాట్లాడు తూ సీహెచ్‌సీలో పని చేసే వైద్యాధికారి ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో హాస్పిటల్‌లో నిధులు పక్కదారి పట్టినట్లు, సిబ్బంది వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారన్నారు. దీంతో విచారణ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బందిని విచారణ చేపట్టామన్నారు.

## సంఘాల ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలి



**కోవూరు, నవంబం15ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాల యంలో కోవూరు ఏరియా పరిధిల ోని ఆరు మండలాలకు సంబంధి ంచిన ఆడిట్ సీఆర్‌పీలకు చివరి రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌లు హరి,వెంకటరమణ య్య లు మాట్లాడుతూ ఆడిట్ సీఆర్‌పీలు సంఘాల వద్దకు వెళ్లి పూర్తిస్థాయిలో ఆడిట్ చేసిన తర్వాత సంబం ధిత సంఘానికి ఆడిట్ రిపోర్ట్‌ను తప్పక ఇవ్వాలన్నారు. ఈ ఆడిట్‌ను ఎటువంటి వివాదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా చేసేలా ఆడిట్ సీఆర్‌పీలు తగు చొరవ తీసుకోవాలన్నారు. సంఘాల రికార్డులను నిశితంగా పరిశీలించిన తర్వాత మాత్రమే ఆడిట్ చేయాలన్నారు. అనంతరం గ్రామస్థాయి నుంచి సంఘాల రికార్డును పరిశీలించి ఏ విధంగా ఆడిట్ చేయాలో సీఆర్‌పీలకు ఉదాహరణ పూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్బరాజు, సీసీలు రాజశేఖర్, రాము, చైతన్యబాబు, శోభా, తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళలనాన్ని జయప్రదం చేయండి



**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యు) 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమానికి జేజేలు పలుకుతూ డిసెంబర్ 1న కందుకూరులో జరుగుతున్న కందుకూరు, కావలి పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర నాయకులు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆర్.హరిబాబు, ప్రముఖ అడ్వకేట్ ఎల్‌వీ బ్రహ్మయ్యలు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన లోగో ఆవిష్కరణ శుక్రవారం నాడు కందుకూరు పట్టణంలోని టీఆర్‌ఆర్ గ్రౌండ్స్‌లో జరిగింది. హరిబాబు, బ్రహ్మయ్యలు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్ని రకాల పీడనలకు వ్యతిరేకంగా కులోన్మాద దాడులకు వ్యతిరేకంగా, క్రింది స్థాయి విద్యార్థుల్లో , ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపేందుకు నాడు పీడీఎస్‌యు ఏర్పడిందన్నారు. దళిత, పేద విద్యార్థుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం పీడీఎస్‌యు పోరాటం చేసిందన్నారు. పీడీఎస్‌యు 50 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డిసెంబర్ 1న కందుకూరులో జరిగే పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ 1974 లో హైదరాబాద్ ఉస్మానియా కేంద్రం ఏర్పడిన పీడీఎస్‌యు తక్కువ కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన విద్యార్థి సంఘంగా ఏర్పడిందన్నారు. కాల క్రమంలో అనేక మంది విలువైన విద్యార్థి రత్నాల్ని సంఘం కోల్పోయిందన్నారు. గత ఉద్యమాన్ని సమీక్షించుకుని భవిష్యత్తు పోరాటాన్ని రూపొందించుకోవడం కోసం జరుగుతున్న ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు ప్రకాశం జిల్లా అధ్యక్షులు సీహెచ్ శ్యామ్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎం.సునీల్, పీడీఎస్ మాజీ రాష్ట్ర నాయకులు సీఎస్ సాగర్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి.పద్మ, పీడీఎస్‌యు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం వలన ఎంతో ఉపయోగకరం



**కోవూరు, నవంబం15ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి పుస్తక పఠనం చేయడం ద్వారా వారి మేదస్సు మరింత పదును అవుతుందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు టి. చెంగమ్మ తెలిపారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 57వ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రంథాలయంలో మహనీయులు, దేశనాయకులు, చరిత్రకారులకు సంబంధించిన అనేక పుస్తకాలు ఉన్నాయని, వాటిని చదివి అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, పాఠకులు శివకుమార్, తదితరులు ఉన్నారు.

## హిందూ శక్తి ప్రదర్శనకు సిద్ధం కండి



**ఉదయగిరి, నవంబర్ 15, ప్రభాతవార్త :** హిందూ శక్తి ప్రదర్శనకు సిద్ధం కావా లని హైందవ శంఖారావం ప్రాంత సహకార దర్శి కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయగిరి పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లా డుతూ జనవరి 5న విజయ వాడలో జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హిందూ సోదరులు తప్పక తమ శక్తి ప్రదర్శన చూపించాలని పిలుపునిచ్చారు. అనంతరం హైందవ శంఖారావం కరపత్రాలను విడుదల చేశారు.

## నీట మునిగిన వరి పంటను వ్యవసాయాధికారులు పరిశీలన



**ఉదయగిరి, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం కొండాయపాలెం పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో నీట మునిగిన వరి కంకెలను వ్యవసాయాధికారులు ఆంజనేయ నాయక్, రాజశేఖర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి మునిగిన వరి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహించిన సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ



**ఉదయగిరి, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని పలు సచివాలయాల్లో పని చేస్తున్న 11 మంది సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు ఎంపీడీఓ అప్సాజీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసిన వారిలో ఎనర్జీ, వెటర్నరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ పోలీసు, వీఆర్వో, ఏఎన్‌ఎంలు, మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

## విజ్ఞానానికి మూలం పుస్తకపఠనం



**వింజమూరు,నవంబర్15ప్రభాతవార్త:** విజ్ఞానానికి మూలం పుస్తకపఠనమని గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా రెండవరోజు మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తకపఠనం అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకపఠన కార్యక్రమానికి పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయమంటే విజ్ఞాన గని అని గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. దేశంలోని మహనీయుల జీవితచరిత్రలు, వారు సాధించిన విజయాలను , వారి అనుభవాలను , అనుభూతులను తెలుసుకోవచ్చన్నారు. గ్రంథాలయాల వలన ధనిక, పేద తేడా లేకుండా ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ



విడవలూరు, నవంబర్ 15, ప్రభాతవార్త : మండల కేంద్రం ఇందిరమ్మ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గిరిజన ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ఆ కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడం కోసం మండల దళిత నాయకురాలు పల్లం శేషమ్మ శుక్రవారం ఆయా కాలనీలలో పరిశీలి ంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం తగ్గేంత వరకు గిరిజనులు ఆదుకోవడం జరుగుతు ందని ఆమె తెలియజేశారు. అనం తరం గిరిజనులకు 100 ఆహార ప్యాకెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కి అంతరాయం

**నెల్లూరు, నవంబర్ 15, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగుగంగ సబ్ స్టేషన్ 33/11 కేవీ పరిధిలోని 11 కేవీ సంజయ్ గాంధీ నగర్ ఫీడర్, శాంతి నగర్, ఏపీకే ఎస్టేట్, సంజయ్ గాంధీ నగర, డైకస్ రోడ్, జేకె కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరా గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు 33/11 కేవీ బీవీ నగర్, పడారు పల్లి, మాగుంట లేఅవుట్, సప్తగిరికాలనీ, సుందరయ్య కాలనీ, కావేరి నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల 30నిమిషాల నుండి ఉదయం 11 గంటల 30 నిమిషాల వరకు 33/11 కేవీ రైతు బజార్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎఫ్‌సీఐ ఫీడర్ నందుమమ్మత్తులు కారణంగా నజీర్ తోట, కృష్ణానగర్, అశోక్ నగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు 33 /11 కేవీ గోమతినగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ గోమతి నగర్ ఫీడర్ గోమతి నగర్, హరనాథపురం, సర్వేపల్లి కాలవ కట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు చెట్టు కొమ్మలు తొలగింపు మమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబం15ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాలలో మండల అధికారుల సూచనల మేరకు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిం దని , దీనిని పడుగుపాడు పంచా యతీకి సంబంధించిన విద్యార్థుల తల్లి దండ్రులు పూర్తిస్థా యిలో ఉపయోగిం చుకోవాలని మండల విద్యా శాఖ అధికారి రహీమ్ తెలిపారు. స్థానిక పడుగుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు సంబంధించిన అపార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని, దీనికి సంబంధించి సంబంధిత విద్యార్థి యొక్క ఆధార్‌లో ఏమైనా తప్పులు, ఒప్పులు ఉంటే ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో వీటికి తగు సమాచారం ఇచ్చి సవరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయులతో అపార్ విషయాలపై చర్చించారు.

# యుద్ధ ప్రాతిపదికన పనులు వేగవంతం కావాలి



**కోవూరు, నవంబం15ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యేలా పంచాయ తీరాజ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ లక్ష్మీనగర్ ప్రాంతంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 8 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడునడ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ పనులు నిర్దేశించిన నియమ నిబంధనలతో పాటు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలన్నారు. డిసెంబర్‌లోగా మంజూరైన మొత్తం పనులు పూర్తిచేసేలా సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ పథకం కింద చేపట్టే ప్రతి నిర్మాణం ప్రాంతంలో తప్పనిసరిగా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, ఈఈ సుబ్బరాజు, డీఈ మోహన్‌రావు, ఏఈ పరమేశ్వరలింగం, డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ మృదుల, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# నెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి పాటూరు విద్యార్థులు



**కోవూరు, నవంబం 15 ప్రభాత వార్త :** ఆదికవి తిక్కన తిరగాడిన పాటూరు నేలలో ఉన్నత పాఠ శాల విద్యార్థులు పతకాల పంట పండిస్తున్నారు. వీరిలో దాగి ఉన్న నైపుణ్యాలను మరిం త వెలికి తీసేలా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భీమతాటి వెంక టరమణయ్య ప్రత్యేక కృషి చేశారు. కోవూరు మండలం పా టూరు ఉన్నత పాఠశాల విద్యా ర్థులు మరోసారి నెల్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికై సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను పరిశీలించి వారిని ప్రోత్సహిస్తూ మట్టిలో మాణిక్యాల లాంటి విద్యార్థులను మరింత సానబెట్టి జాతీయ స్థాయి పోటీలకు ఆరు మంది విద్యార్థులను ఎంపికయ్యేలా చొరవ తీసుకున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఈ పాఠశాల నుంచి ఆరు మంది విద్యార్థులు ఎంపిక కావడం శుభపరిణామం అన్నారు. ఇప్పటికే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్-14,17,19 విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన ఆరు మంది బాలికలు వెండి పతకాలను , 7 మంది కాంస్య పతకాలను సాధించారన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు జి. అమూల్య, జి. జానకి, పి. వెంకటమాధవి, కె. తేజ, కె జ్యోతి వరప్రసాద్, మహేంద్రలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై డిసెంబర్ 2వ తేది నుంచి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ ఝుల్ఫికర్ ఆలీ ఆహ్మద్, పి. జనార్ధన్‌రెడ్డి, కె. కాలేబు, ఎం. చంద్రమోహన్, రవిశంకర్, శేషయ్య, శీనమ్మ, తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ బారికేడ్‌లు ఏర్పాటు



**బిట్రగుంట, నవంబర్15ప్రభాతవార్త:** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప జాతీయరహదారి గురుకుల పాఠశాల వద్ద జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిట్రగుంట ఎస్ఐ భోజ్యా భారికేడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తు ఒడడంతో వాటిని నివారించేందుకు వీటిని ఏర్పాటు చేశామన్నారు.

# కార్తీక పౌర్ణమి కి కిట కిటలాడిన శైవ క్షేత్రాలు



**బిట్రగుంట, నవంబర్15ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని శైవక్షేత్రాలు శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుండి ఉపవాస దీక్షతో ఉన్న మహిళలు శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు.

# కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంకి పోటెత్తిన బక్తులు

**అత్యంత బక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం.**



**కలిగిరి, నవంబర్15, ప్రభాతవార్త;**కార్తీక పౌర్ణమి కొత్తకళను సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి రోజును పురస్కరించుకొని శుక్రవారం కలిగిరి శివాలయంలోబక్తుల తాకిడి ఎక్కువైంది. ఒకసందర్భంలో ఆలయంలో బక్తులు కార్తీక దీపాలు వెలిగించే స్థలంకూడా కనిపించలేదంటే కార్తీక పౌర్ణమి బక్తుల్లో ఎంతటి బక్తి పారవశ్యాన్ని తీసుకువచ్చిందో చెప్పనక్కరలేదు.అసలే కార్తీక మాసం. అందులోనూ కార్తీక పౌర్ణమి. ఇక బక్తులుపోటెత్తుతున్నారు. ఉదయంనుండే ఆలయా లు బక్తులతో, కార్తీక దీపాలతో కిటకిటలాడుతున్నాయి. బక్తులు తండోపతండాలుగా కలిగిరిలోని శివాలయాలకు క్యూకట్టారు.కలిగిరిలోని శివాలయం,రామాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి గుడి, శ్రీ షిరిడీ సాయిబాబామందిరం, కలిగిరమ్మగుడి ఇలాఏగుడిలో చూసినా కార్తీక దీపాలకాంతులతో ఆలయాలు నిండిపోయాయి. ఇదిచూసిన ప్రజలు ఆలయాలు కార్తీక దీపాలతో దేదీ వ్యమానంగా వెలిగిపోతున్నాయంటూ కొనియాడుతున్నారు. కార్తీకమాసం మహిళలకు అత్యంత ప్రీతి పాత్రమైన నెల. ఈకార్తీక మాసంలోనే అయ్యప్పస్వామి మాలలు దరించిన బక్తులు, వెంకటేశ్వరస్వామి మాలలు, దుర్గాదేవి మాలదారులు ఇలా అనేకమంది మాలదారులు, మహిళా బక్తులతో కార్తీమాసం ఒక కొత్త ఒకవడి కలిగిస్తుంది. దీనికి తోడు కార్తీకమాసంలో వనబోజనాలని ఇలా అనేకరకాల కార్యకలాపాలు, ప్రత్యేక పూజలతో వివాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఈ కార్తీకమాసం బక్తులతో ఒక కొత్తఒరవడిని తీసుకువచ్చిందని బక్తులు పొంగిపోతున్నారు. వీరందరికీ ఆదేవతలు ఆశీస్సులు ఉండాలని కోరుకుందాం.

# చేజర్ల గ్రందాలయంలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



**చేజర్ల నవంబర్ 15 ప్రభాతవార్త :** జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా చేజర్ల శాఖా గ్రంధాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా చేజర్ల మండల పంచాయితీ వార్డు మెంబర్ హుజరత్‌బాబు, అమరా జనార్దన్, దేవతి సుబ్బారావు పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శనలో ఆధ్యాత్మిక గ్రంధాలు,రామాయణం, భాగవతం, ఆరోగ్యానికి సంబందించిన పుస్తకాలు వంటల పుస్తకాలు,హాస్యకధల పుస్తకాలు, వంటల పుస్తకాలు, నీతి కధల పుస్తకాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో గ్రంధాల అధికారిని కల్పన ఎల్ఐసి గోపి,ప్రభాకర్ మెంటా వెంకటేశ్వర్లు,దేవతా హజరత్, పువ్వాడా సుబ్బారావులు పాల్గొన్నారు.

# ఆదరణ కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**బిట్రగుంట, నవంబర్15ప్రభాతవార్త:** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో శుక్రవారం కావలి శాసనసభ్యులు డి.వి.కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావ్ ఆధ్వర్యంలో కేక్‌లు పంపిణీ చేయడంతోపాటు గిరిజన కాలనీల్లో డి.ప్రభాకర్ ధాతృత్వంతో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, పి.సుధాకర్ యాదవ్, ఎ.ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో అఖండ దీపోత్సవం



**బుచ్చి నవంబర్ 15 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో కార్తికపౌర్ణమి పురస్కరించుకొని అఖండ దీపోత్సవం వేడుకగా జరిగింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అఖండదీపంలో నువ్వుల నూనె పోశారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహచారి మాట్లాడుతు కార్తీక మాసంలో దీపాలు వెలిగిస్తే సకల పాపాలు వైదొలగి మంచి జరుగుతుందని తెలిపారు. భక్తులకు స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా దర్శిబాల నరసింహారావు,శిరిషా దంపతులు వ్యవహారించారు.భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ కమీటి వారు పర్యవేక్షించారు.

# ఎటువంటి అభ్యంతారాలు ఉన్నా ఓటర్లు పరిష్కరించుకోవచ్చు

## కావలి మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్



**కావలి, నవంబర్ 15 ప్రభాతవార్త :** స్పెషల్ సమ్మరి రివిజన్ - 2025 ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం ప్రచురించబడిన డ్రాఫ్ట్ ఓటర్‌లిస్టుకు సంబంధించి ఎటువంటి అభ్యంతారాలు ఉన్నా సత్వరపరిష్కారం జరుగుతుందని కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కావలి బాలకృష్ణారెడ్డినగర్ సచివాలయంలో పలుపోలింగ్ కేంద్రాల బూత్‌లెవల్ అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లనుండి ఎటువంటి అభ్యంతరాలు చోటుచేసుకుంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని కమీషనర్ ఆదేశించారు. ఫిర్యాదులకు తావివ్వద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, ఎలక్షన్ వింగ్ ఆర్ఐ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# జెన్ని కి క్రిస్టియన్ మైనార్టీ సంఘ సభ్యుల అభినందనలు



**వింజమూరు, నవంబర్15ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమింపబడిన జెన్ని రమణయ్యను టిడిపి క్రిస్టియన్ మైనార్టీ సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు బూదాల లక్ష్మణ్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమనేతగా జెన్ని రమణయ్య ఎస్సీ వర్గీకరణకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలోని మాదిగల శ్రేయస్సుకొరకు కృషి చేశాడన్నారు. గత ఎన్నికల సమయంలో టిడిపిలో చేరి పార్టీ విజయానికి ఎంతో కష్టపడ్డారన్నారు. జెన్ని రమణయ్య కష్టాన్ని గుర్తించిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కార్పోరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం శుభపరిణామమన్నారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కార్తీకపౌర్ణమికి భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు



**కావలి, నవంబర్ 15 ప్రభాతవార్త :** కార్తీకమాసంలో కార్తీకపౌర్ణమి శుక్రవారం రావడంతో భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. వరాష్నిసైతం లెక్కచేయకుండా భక్తులు కావలి శివాలయంలో పోటెత్తారు. కావలిపట్టణంలో వేంచేసిఉన్న శ్రీదుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం) ఆలయానికి తెల్లవారుజామునుంచి రాత్రివరకు భక్తులు క్యూలో శివపార్వతులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా కార్తీకదీపాల వెలుగుల్లో భక్తులు ముంచెత్తారు. మనిషి నిలబడేందుకు వీలులేకుండా భక్తులు విపరీతంగా తరలివచ్చి శివయ్యను దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక అర్చకులు ఎఆర్ శశిధర్‌గురుకుల్ తన భక్తబృందంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. భక్తులు ఎక్కడా అసహనానికి తావులేకుండా వారికి సౌకర్యాలు కల్పించారు. కార్తీకపౌర్ణమి విశేషం కావడంతో కావలి వన్‌టౌన్ పోలీసులు భద్రతాచర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం 6:30 గంటల సమీపంలో కావలి శివాలయం భక్తులతో పోటెత్తింది. పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయప్రాంగణంలో వెలసిఉన్న ఉమామహేశ్వర ఆలయం, ముసునూరు శివాలయం, వెంగళరావునగర్ శివాలయం, తదితర శివాలయాలు, మిగిలిన ఆలయాల్లో భక్తులు కార్తీకపౌర్ణమి పూజలు నిర్వహించారు.

# దూండీ రాకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కందుకూరు ఆర్యవైశ్యులు

**- డిసెంబర్ 8న పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహావిష్కరణకు ఆహ్వానించిన ఆర్యవైశ్యులు**



**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కూటమి ప్రభుత్వం దూండీ రాకేష్‌ను నియమించిన సందర్భంగా కందుకూరు నగర ఆర్యవైశ్యులు విజయవాడలోని ఆయన కార్యాలయం నందు ఘనంగా సన్మానించి, డిసెంబర్ 8వ తేదీన కందుకూరు పెద్దబజార్‌లో కాంస్య విగ్రహ ఆవిష్కరణకు కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్‌ను ఆహ్వానించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ మురారిశెట్టి సుధీర్‌కుమార్, ఆర్యవైశ్య మీడియా చక్కా వెంకట కేశవరావు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహం, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట కిషోర్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వైస్ ప్రెసిడెంట్ బొగ్గవరపు ప్రసాద్, దేసు ప్రసాద్ పాల్గొన్నారు.

# అఖిల భారత సహకార సంఘ వారోత్సవాలు



**వింజమూరు, నవంబర్15ప్రభాతవార్త:** 71వ అఖిల భారత సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సహకార సంఘంలో కావలి డివిజన్ కోఆపరేటివ్ అధికారి వై.మాలకొండయ్య వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వారోత్సవాలు ప్రతి సంవత్సరం నవంబర్ 14నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాల్లో సహకార సంఘాలను బలోపేతం చేయడం ద్వారా ఆన్‌లైన్ సేవలు అందించడం, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడం, సహకార సంఘాల ద్వారా అందించే వివిధ రకాల సేవలను గురించి వివరించారు. ఉదయగిరి సబ్‌డివిజన్ అధికారి శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సూర్యనారాయణ, సీనియర్ ఇన్స్‌పెక్టర్ సి.హెచ్.రమేష్‌బాబు, స్థానిక బ్యాంక్ మేనేజర్ రాంనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ సురేంద్రరెడ్డి, సిఇఒలు షేక్ ఖాజామస్తాన్, మేకలరమణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సిబ్బంది రాధిక, మానస, శ్రీనివాసులురెడ్డి, వేణు, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రంధాలయ వారోత్సవాల్లో చిత్రలేఖనం పోటీలు



**పాసు పుస్తకములు పోయినవి**

కోవూరు మండలం, మోదేగుంట గ్రామానికి చెందిన జి.మధుసూదన్ రెడ్డి, గీర్వాణి లకు సంబంధించిన రెండు పాసు పుస్తకములు గ్రామం నుంచి జెరాక్స్ తీసుకొనేందుకు వస్తుండగా ఎక్కడో పడిపోయినవి. పాసు పుస్తకముల నెంబర్లు : 139, 165. సదరు పాసు పుస్తకములు ఎవరికైనా దొరికిన యెడల తీసుకువచ్చి మాకు ఇస్తే తగు బహుమతి ఇవ్వబడును.

జి.మధుసూదన్ రెడ్డి, సెల్ నెం. 8639976036

**ఉలవపాడు, నవంబర్ 15, ప్రభాతవార్త :** గ్రంధాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా ఐదు పాఠశాలకు చెందిన పిల్లలకు చిత్రలేఖణం పోటీలు నిర్వహించడం జరిగిందని ఉలవపాడు శాఖ గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధపాలకుడు మాట్లాడుతూ దేశభక్తి పట్ల పిల్లల్లో ఆసక్తి పెంపొందించేందుకు చిత్రలేఖణం పోటీలు నిర్వహించనున్నారు. ఈ చిత్రలేఖనం పోటీలకు 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ పోటీలకు విద్యార్థులను పంపిస్తున్న యాజామన్యానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రంధపాలకుడు కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# చేవూరు చెరువు ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

**- ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను అమలు చేయని తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి**

**- సబ్ కలెక్టర్ తిరుమణిశ్రీ పూజకు ఫిర్యాదు**




**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం చేవూరు చెరువు పోరంబోకును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరి ఆదేశాలన అమలు చేయాలని తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని హేతువాద సంఘం అధ్యక్షులు నార్ని వెంకట సుబ్బయ్య, మొగల్ కాలేషా బేగ్ శుక్రవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కలిసి వినతిపత్రం అందజేశారు. రామదూత ఆక్రమణ నుండి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరి ఆదేశం ఇచ్చి నాగులు సంవత్సరాలు గడుస్తుందని, ఇంత వరకు ఆక్రమణలు తొలగించలేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై సానుకూలంగా ఆమె స్పందించినట్లు వారు తెలిపారు.

# ఈనెల 17వ తేదీ జరిగే మాలల మహాగర్జన బహిరంగ సభ 24వ తేదీకి వాయిదా



**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :** భారీ వర్షాల కారణంగా బహిరంగ సభ ప్రాంగణం భాగా తడిసినందువలన ఈనెల 17న జరగాల్సిన మాలల మహాగర్జన బహిరంగ సభ వాయిదా వేస్తున్నట్లు మాల ఉద్యోగుల సంఘ కన్వీనర్ చిదుతోటి శ్రీరాములు తెలిపారు. మరలా నవంబర్ 24వ తేదీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు మాల ఉద్యోగుల సంఘ నాయకులు తెలియజేశారు. కావున ప్రతి ఒక్కరూ గమనించగలరని మాలమహానాడు ఉద్యోగుల సంఘం తరపున మనవి చేస్తున్నారు.

# పొగాకు తోట, నారుమళ్ళలో వర్షపు నీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**- వేలం నిర్వహణాధికారి బి.చంద్రశేఖర్**

**కందుకూరు, నవంబర్ 15, ప్రభాతవార్త** : కందుకూరు 27వ పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వేలం నిర్వహణ అధికారి బి.చంద్రశేఖర్, ఎస్‌జీవో కే.రాజగోపాల్‌రెడ్డితో కలిసి నారుమళ్ళు, పొగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాల్లో, నారు మళ్ళల్లో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో విడుపులు వేయాలని కోరారు. వర్షం ఆగిన తర్వాత ఎకరాకు 15 నుంచి 25 కేజీల అమ్మోనియం సల్ఫేట్ ఎరువును వాడాలని కోరారు. తదుపరి పొటాషియం నైట్రేట్ మందును నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలని తెలిపారు. పొలాలు ఆరిన తర్వాత అంతర సేద్యం చేయాలని తెలిపారు. దీని వలన గాలి ప్రసరణ జరిగి మొక్కలకు పోషకాలు అందుతాయని అన్నారు. ఈ వర్షాలకు తెగుళ్ళు సోకే అవకాశం ఉందని, దీనికోసం లద్దె పురుగు నివారణకు ప్రొక్లెమ్ మందును 5 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపాలన్నారు. తెగులుకు మైలు తుత్త ద్రావణాన్ని 20 గ్రాముల కాపర్ సల్ఫేట్, 20 గ్రాముల సున్నం, 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అంతే కాకుండా 20 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని అన్నారు. అంతే కాక నాట్లు వేసేటప్పుడు నాణ్యమైన నారును మాత్రమే నాటుకోవాలని చెప్పారు.

# చెకుముఖి అవార్డు ప్రధానోత్సవం



**బుచ్చి నవంబర్ 15 ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులుగా ఎదగాలని రచయిత డాక్టర్ చీదరాల చెన్నయ్య పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్‌ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మినీ టౌన్‌హాలు నందు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిన్నారులన్నా గులాబి పువ్వులన్నా నెహ్రుకు ఎంతో ఇష్టమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్.ఎమ్, షోరూం అధినేత బి.మురళీకృష్ణ చెన్నై హాస్పటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్‌వి రమేష్‌బాబు, ఎస్.వి.ఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, హైదరాబాద్ లైటింగ్ అండ్ హైరర్స్ అధినేత షేక్ రియాజ్‌బాషా, నిర్మాపకులు మురళీమోహన్‌రాజు,డాక్టర్ రాచపాళెం రఘు, కెవి రమణ, అరవ రాయప్ప, కరాటి మాష్టార్ ఆది మహారాజ్,కవి అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

# చేజర్ల విజ్ఞాన్ జూనియర్ కాలేజిలో ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు



**చేజర్ల నవంబర్ 15 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన చేజర్లలలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజిలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్ధినులు శివలింగాకారంలో కార్తీకదీపాలు వెలిగించారు. ఈదీపాలు అందర్ని ఆకట్టుకున్నాయి. విద్యార్ధినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

# కోటి తీర్ధంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**చేజర్ల నవంబర్ 15 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని కోటి తీర్ధంలోని శ్రీ కోటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు పెన్నానది స్నానం ఆచరించి కార్తీకదీపాలు వెలిగించారు. అలాగే సాయింత్రం పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయాలన్ని మహిళలతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి వేడుకల్లో బాగంగా కోటేశ్వరస్వామికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు.

# జడ్పీహెచ్ఎస్ ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**ఉలవపాడు, నవంబర్ 15, ప్రభాతవార్త :** మండలంలోని భీమవరం జడ్పీహెచ్ఎస్‌లో బాలల దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేడికొండ భాస్కరరావు పర్యవేక్షించారు. తొలుత నెహ్రు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పండిట్ జవహర్‌నెహ్రు దేశానికి చేసిన సేవలను గురించి వివరించారు. అనంతరం విద్యార్ధులు వేసిన వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, అనూక్, అభిషేక్, మస్తాన్‌వలి, హేమలత, చిట్టిబాబు, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# కావలి తహశీల్దారును కలిసిన న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య



**కావలిరూరల్, నవంబర్ 15 ప్రభాతవార్త :** కావలి తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌ను న్యాయవాది ఎపిబిసి అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యల గురించి తెలియచేశారు. ఇర్ల వెంకటరమణయ్య మాట్లాడారు. కావలి మండల పరిధిలోని ల్యాండ్ రీసర్వేలో గత ప్రభుత్వంలో జరిగిన లోపాలపై ప్రత్యేకదృష్టి చూపాలని తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌ను కోరడం జరిగింది. ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేదిశగా కృషిచేస్తున్న తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

